# మునకే సుఖం

ఉన్నట్టుండి మెలకువ వచ్చింది రమణయ్యకు కడుపులో నొప్పి రావడం వల్లే మేలుకున్నాడు. భరించలేనంత నొప్పిగా వుంది. టక్కున మంచంమీదనించీ లేచి కూచున్నాడు. నొప్పించే చోటు గట్టిగా అదిమి పట్టుకున్నాడు. క్రితంరోజు ఇట్లాగే నొప్పి వస్తే కడుపునొప్పి మాత్రలేవో వాళ్ళ ఆఫీసులో పనిచేస్తూ ఉన్న మోహనరావు చెబితే అటెండరుతో తెప్పించి వేసుకున్నాడు. ఓ గంట తర్వాత నొప్పి తగ్గింది.

ఇప్పుడు మళ్ళీ అదే రకమైన నొప్పి! నిన్నటికంటే తీవ్రస్థాయిలో వుంది. గడియారం వైపు చూశాడు – రెండుగంటలయింది.

తన భార్య విశాల మంచి నిద్రలో వుంది. బాబూ, పద్మలు కొద్ది దూరంలో విడివిడిగా మంచాలలో నిద్రిస్తూ వున్నారు. అయిదో నెంబరు మీద ఉండడం వల్ల సీలింగు ఫ్యాను విపరీతమైన వేగంతో తిరుగుతోంది. జీరో బల్బు మసక వెలుతురు లేత ఆకుపచ్చగా ఆవరించి వుంది ఆగదిలో.

"విశాలా!" అంటూ పిలిచాడు, కదల్లేదామే. మళ్ళీపిలిచాడు 'ఊఁ' అంటూ మూలిగింది విశాల.

"లెయ్యవే, కడుపులో నొప్పిగా వుంది!" అన్నాడు. అక్కడే గోడమేకుకి తగిలేసి వున్న చొక్కాని అందుకుని జేబులో ఉన్న మాత్రల్ని తీసుకున్నాడు.

బద్ధకంగా కళ్ళు తెరిచిన విశాల అతని కడుపులో నొప్పి అని వింటూనే అదిరిపడి లేచింది. "నొప్పా? ఎంత సేపట్నించీ?" అంది కంగారు పడిపోతూనే అతని పక్కగా వచ్చి కూచుంది.

"అయిదు నిమిషాలయింది మెలకువవచ్చి... నొప్పితోనే మేలుకున్నాను. మాత్ర లున్నాయిలే – ఓ గ్లాసు మంచి నీళ్లియ్యి!" అన్నాడు కళ్ళు మూసుకుని బాధని భరిస్తూనే.

వంటింట్లోకి వెళ్ళి ఓ గ్లాసుడు మంచినీళ్లు తెచ్చి ఇచ్చింది విశాల. మాత్రలు

మింగాడు రమణయ్య. మొహంలోని బాధని గమనిస్తూ దీనంగా చూస్తూకూచుంది విశాల.

"ఎక్కువగా ఉందా నొప్పి!" అందామె అతని మొహంలోకి తేరిపార జూస్తూ!

"ఊఁ" అన్నాడు రమణయ్య పళ్ళబిగువున కింది పెదవిని కరచిపెట్టి.

అతన్నలా చూస్తోంటే ఏం చేయాలో పాలు పోవడంలేదు విశాలకు.

"ఏ డాక్టరు దగ్గరికన్నా పోదామా?" అంది.

"వద్దులేవే... ఎందుకూ?"

"మరి, ఆ మాత్రలతో నొప్పి తగ్గకుంటేనో!?"

"ఇంత రాత్రిపూట ఏ డాక్టరు దగ్గరికి పోగలం ఆటోలు కూడా దొరకవు కనీసం... గవుర్నమెంటు హాస్పిటల్ కి పోవాలన్నా 3 కిలోమీటర్ల పైన వుంది దూరం".

"అన్నిటికీ అన్ని చెప్తావు!" అంది బాధగా విశాల.

పొట్టమీద చేతులుబాగా అదిమి పట్టుకుని తలవంచుకుని కూచున్నాడు రమణయ్య. విశాల దిగులు దిగులుగా చూస్తూ వుంది భర్తని.

అపుడపుడు గోడ గడియారం వైపు చూస్తూవుంది. గడియారం ముళ్ళు నిమ్మకు నీరెత్తినట్టు అతి బద్దకంగా తిరుగుతున్నాయి. ఎప్పుడు తెల్లవారుతుందా అనిపిస్తోంది ప్రతి నిమిషమూ.

"ఎట్లుంది, కొంచెమన్నా తగ్గిందా?" అనడిగింది విశాల అతను 'ఊఁ' అంటాడని ఆవిడ ఆశ.

'లేదు' అన్నాడతను.

రెండు నిమిషాల తర్వాత "బాత్రూమ్‌లో నీళ్ళు పెట్టిరావా, వెళ్ళిరావాలనిపిస్తా వుంది" అన్నాడు రమణయ్య.

గబగబా బాత్రూమ్ వేపు ఉరుకుల పరుగుల మీద వెళ్ళి నీళ్ల బకెట్టులో తోడి వచ్చింది విశాల.

కడుపు అదిమి పట్టుకునే మెల్లగా అడుగులు వేస్తూ బాత్రూమ్‌లోకి దూరిపో యాడు రమణయ్య. విశాల కళ్ళల్లో నీళ్లు తిరిగాయి. ఆమె ఆలోచనలు ఏదో కీడు శంకిస్తున్నాయి.

ఏ అలవాటులేని మనిషి, ఎప్పుడూ నవ్వుతూ వుండే మనిషి...ఆవిడ కళ్ళ వెంబడి నీళ్లు ఉబికి ఉబికి వస్తున్నాయి. బాత్రూమ్ తలుపు తెరిచిన శబ్దమవుతున్నట్టుంటే కొంగుతో కన్నీళ్లు తుడిచేసుకుంది విశాల. తన కన్నీటితో రమణయ్య ఇంకా డీలాపడిపోతాడని ఆవిడ భయం!

"ఇప్పుడెట్లుంది?" అని అడుగుదామనుకుంది. అతని ముఖంలోనూ, కడుపులోనూ పట్టుకున్న తీరులోనూ, కించిత్తు కూడా మార్పులేకపోడంతో మానుకుంది.

అతను మెల్లగా నడుస్తూ వుంటే ఆసరగా అతని ఎడమ భుజాన్ని పట్టుకుని మంచంపై కూచోపెట్టింది.

గడియారంలో ముళ్లు 'రెండు నలభై అయిదు' అని తెలుపుతున్నాయి. అంటే మాత్రలు మింగి ముప్పావుగంట అవుతోందన్నమాట!

'తగ్గిందా?' అని మెల్లగా అడిగింది. విశాల 'లే'దంటాడన్న భయంతోనే

'రవ్వంత తగ్గింది' అన్నాడతను.

'హమ్మయ్య!' అనుకుంది. మరేం ఫర్వాలేదు మందు పనిచేస్తూ వుంది. ఇంకో పావుగంటలో మరింత నొప్పి తగ్గుతుంది. పూర్తినొప్పి తగ్గిపోవడానికి ఎంతసేపు పడుతుందా అని గడియారాన్ని చూస్తూ లెక్కలు వేస్తూ ఉంది విశాల.

పావుగంట గడిచింది.

'నొప్పి దాదాపు తగ్గింది విశాలా!' అన్నాడు రమణయ్య. ఇప్పుడతని చేతులు కడుపును అదిమి పట్టుకుని లేవు. అలవోగ్గా కడుపుమీద ఉన్నాయి.

"నువ్వు నిద్రపోయే! - ఇంక తగ్గిపోతుందిలే" అన్నాడు. ఇప్పుడతని మాటలు తెరిపిగా వున్నాయి.

"పొద్దనికి డాక్టరు దగ్గరికి పోయి చూపించుకోని రావే... పెద్దాసుపత్రిలో నీకెవరో తెలిసినతను ఉన్నాడంటివే. అతని ద్వారా చూపించుకో - రేపు ఆఫీసుకి సెలవు పెట్టెయ్యి" అంది విశాల.

"అవును, సెలవు పెట్టేసి చూపించుకోవల్ల. ఒళ్ళంతా ఒకటే 'జిల'గా కూడా ఉంటున్నది దాన్ని కూడా చూపించుకోవల్ల... నాకు నొప్పి తగ్గింది గానీ, నువ్వు నిద్రపోవే! నీ ఆరోగ్యం కూడా అంతంత మాత్రమే!"

"నీకు నొప్పి తగ్గితే చాల్లేబ్బా!" అంటూనే పెద్దగా ఒక్కసారి ఆవులించేసి పడుకుని కళ్లుమూసుకుంది విశాల.

రమణయ్యకు ఎంత ప్రయత్నించినా నిద్ర రావడం లేదు. అతని ఆలోచనలు కుటుంబం చుట్టూ చిత్ర విచిత్రంగా పిచ్చి పిచ్చిగా సాగుతున్నాయి. తనకు వచ్చిన కడుపునొప్పికి ఏ అల్సరో, అపెండిసైటిసో కారణమైతే - ఆపరేషన్ తప్పదేమో! ఇట్లా అనుకుంటూ ఉంటే అతని గుండెలు గుబగుబలాడాయి. ఎంత చిన్న ఆపరేషను అయినా డాక్టర్ ఫీజులూ, ఇతర ఖర్చులూ పదివేల దాకా అవుతాయి. దేవుడు ఎందుకిలా పరీక్షిస్తున్నాడు తనని? ఆర్నెల్ల క్రితం విశాల ఆయాసంగా ఉందనీ, ఎదలో నొప్పిగా వుందనీ అంటూంటే డాక్టరు దగ్గరకు తీసికెళ్ళాడు. గుండెకు బైపాసు సర్జరీ అవసరమని అన్నాడు డాక్టరు. ఏభై వేలదాకా ఆపరేషన్ ఖర్చు కావచ్చునని చెప్పాడు కూడా. ప్రైవేటు నర్సింగ్ హోమయితే మంచిదన్నారు చాలామంది. దాంతో దగ్గరి మిత్రులతో అప్పుచేశాడు. అక్కడికీ ఇరవైవేలు కావల్సివస్తే పిల్లల పేరిట ఉన్న రికరింగు డిపాజిట్లను రద్దుచేసి ఏభైవేలు జమచేశాడు. అప్పటికి కానీ ఆపరేషన్ జరగలేదు. ఆపరేషన్ అయిపోయాక ఖర్చు అంతటితో ఆగిపోలేదు. విశాలను ఇంటికి తీసుకవచ్చాక తిండి విషయంలోనూ, మందుల విషయంలోనూ ఈ ఆర్నెల్ల కాలంలో పదివేలకు పైనే అయిపోయింది. ఇందుకుగానూ విశాల మెడలోని తాళిబొట్టు వున్న బంగారు దండా, చెవుల్లోని బంగారు కమ్మలు అమ్మి వేయాల్సి వచ్చింది. ఎదిగిన

కూతురు ఇంట్లో వుండగా దండనీ, కమ్మల్నీ ఇవ్వనని విశాల ఒకటే పట్టుపట్టినా రమణయ్య వినలేదు.

విశాల జబ్బుకోసం చేసిన అప్పులే ఇంకా తీరలేదు - అప్పుడే ఈ కడుపునొప్పి ఒకటి! భగవాన్! నన్ను విషమ పరీక్షకు గురిచెయ్యకు తండ్రీ! అంటూ మనసులోనే వేడుకున్నాడు.

తన వయస్సు ఏభయ్యేకదా! అప్పుడే తన శరీరం పనికిమాలిన దయిపోతోందా?

ఎడమచేతి మీద నవ్వ పుట్టినట్టయి గీరుకున్నాడు. అంతే 'జిల' మొదలయింది. గీరుతున్న కొద్దీ నవ్వలు చర్మం చిట్లి రక్తం వస్తుందా అనిపించేట్టు! నెలక్రితం డాక్టరు దగ్గరికి వెళ్ళి చూపించుకున్నాడు. మూత్రపరీక్షల్లో అల్బుమిన్ శాతం ఎక్కువ వున్నట్టు తేలింది. ఏవేవో మందులు రాసిచ్చాడు డాక్టరు. ఆ మందుల్ని మింగుతూనే వున్నా నవ్వలు నయం కాలేదు. పైగా కాళ్ళూ, చేతులూ, మొహం వాస్తూ వున్నాయి. ఇదేం భయంకరమైన వ్యాధో!

బయట ఫైరింజను పెద్దగా సైరను శబ్దం చేస్తూ వెళ్ళింది. గది బయటికి వచ్చి చూశాడు ఎక్కడ అంటుకుని ఉందోనని. మంటలు లేస్తున్నట్టుగా కానీ, పెద్ద వెలుతురుగానీ ఎక్కడా కనుచూపుమేరలో కనిపించలేదు. ఆ ఇంటికి వచ్చిన కొత్తలో రాత్రిళ్ళు మెలకువ వస్తే ఇలా ఇంటి బయటికి వచ్చి నుంచునే వాడు. అక్కడినించీ తారలు నేలకు దిగినట్టు కనబడే విద్యుత్ దీపాలతో మిణుకుమిణుకుమంటున్న నగర సౌందర్యాన్ని అరగంట చూసీ, సుదూరంగా లీలగా కనబడే బిర్లామందిరాన్ని చూసీ, ఒక్కసారి తనకి ఇంత అందాన్ని చూసే అదృష్టాన్ని ఇచ్చినందుకు నమస్కరించేవాడు. ఇప్పుడు నిర్లిప్తంగా చూసి "భగవాన్! నన్నూ నా కుటుంబాన్నీ రక్షించు!" అని మొక్కుకున్నాడు. తిరిగి వచ్చి విశాల పక్కలో పడుకున్నాడు.

ఎప్పుడు నిద్రపట్టిందో తెలీదు.

ఎక్కడో ఏదో చిత్రమైన శబ్దం వినిపిస్తున్నట్టు అనిపించి కళ్ళు తెరిచి చూశాడు-

తను పడవలో పోతున్నాడు... పడవ ఒకటే ఊగిపోతోంది. అది సముద్రమా! నదా!... సముద్రమే - నిస్సందేహంగా సముద్రమే -

చుట్టూతా చీకటి!

ఆ చిన్న పడవలో తను ఒక్కడే!

తను ఆ పడవలోకి ఎందుకు ఎక్కాడు?

ఎవరు ఎక్కించారు?

ఏమో!?!

ఎక్కడికి వెళుతున్నాడో!

ఎక్కడికో తెలీదు -

ఏ దరికి ప్రయాణించాలో తెలీదు.

ఏ సహాయామూ లేని చోట!

ఎంత గట్టిగా అరచినా ఎవరికీ వినిపించనిచోట!

పడవ ఊగిపోతోంది.

సముద్రపు కెరటాలు పెద్ద ఎత్తున లేస్తున్నాయి!

ఈ గాలేమిటో ఇంతగా వీస్తోంది -

తుఫానేమో!?

అవును గాలీ... వానా...

తుఫానే!

ఏం చేయడం?

అరెరే - పడవలోకి నీళ్లు వస్తున్నాయి!

ఎక్కడయినా చిల్లుపడిందేమో.

పడవ మునిగి...ము... ని... గి...

అవును మునిగిపోతోంది!

ఏం చేయడం!

తనిప్పుడు మునిగిపోతాడు.

తను ఇన్నేళ్ళూ బ్రతికింది - ఇందుకా దిక్కులేని చోట మునిగిపోయేందుకా - ఏదీ వి - విశాల, పద్మ ఏదీ, బాబుగాడేడీ!

తను ఇక్కడ ఒంటరిగా మునిగి పోబోతున్నడా? అసలు జీవితం ఏమిటి?

ఇంతేనా!

చావెప్పుడూ ఒంటరిదేనా?

తనని రక్షించే దిక్కు లేదిపుడు. అసలు నన్నీ ఒంటి పడవలోకి ఎక్కించిందెవరు?

పడవ మునిగిపోతోంది!

ఇప్పుడెట్లా!

ఏం చేయడం?

దూరంగా నైనా తీరం కనబడటం లేదా!

పడవ మునిగిపోయింది!

తను ఈదుతూ ఉన్నాడు, ఈదుతూ ఉన్నాడు... ఎంత సేపిలా ఈదటం! అంతులేని సముద్రంలో తను గట్టు చేరగలడా? వృథా ప్రయాస! ఈదుతూనే 'రక్షించండి!' అని అరిచాడు- 'కాపాడండీ' అంటూ గావు కేకలు పెట్టాడు- వినడానికి ఎవరున్నారు- హోరున వీచేగాలి, ఎగిసెగిసిపడే కెరటాలు తప్ప!

ఈదుతూ ఉన్నాడు!

భుజాలు అలసి పోయాయి!

కాళ్ళు అలసి పోయాయి!

ఇకతను ఈదలేడు!

మునిగి పోతున్నాడు.

ఊపిరి ఆడ్డం లేదు–

ఇక అయిపోయింది తన కథ...

మెలకువ వచ్చేసింది...

ఇంతసేపూ తనని హడలు కొట్టించింది కలే నన్నమాట!

రమణయ్య పెదాలపై రేఖా మాత్రంగా నవ్వు విరిసింది. ఇందాకటి భయంకరమైన సన్నివేశం ఇప్పుడు లేదనేనా!

ఆ నవ్వు తనకీ చిత్రంగా అనిపించింది. గడియారాన్ని చూశాడు నాలుగ్గంటలు కావస్తోంది. దాదాపు గంట సేపట్నించీ కలలో సముద్రం మధ్య, చీకటిలో, హోరుగాలిలో, ఓటి పడవలో తను... అసలు తను ఎందుకు అంత భయపడ్డట్టు.

అది కలే అయినా అప్పటికి అది నిజం...

ఆ సముద్రం, ఆ పడవ... ఆ వాతావరణం... అప్పటికి నిజం! ఎవరో అన్న విషయం గుర్తుకు వచ్చింది. ఈ ప్రపంచం నిజమని బ్రతుకుతున్నాం. అసలు ఈ ప్రపంచ విషయాలన్నీ ఎక్కడో మనం నిద్రిస్తూ కన్న కలేనేమో– సుదీర్ఘమైనకల– అయితే... ఈ విశాలా, పద్మా– బాబూ ఈ ఉద్యోగం ఆఫీసు, ఆఫీసరూ కలే! ఇందాక వచ్చిన కడుపునొప్పి కూడా కలే, అయితే... ఇప్పుడే వచ్చిన కల! సముద్రం తుఫానూ, ఓటి పడవా కలలోని 'పీడకల' అవాలేమో! తాత్వికంలోకి పోతున్నాడా తనూ? తనలో తనకే తెలియని ఇంత తాత్వికత ఉందా! అయినా– తనకి కలలో కూడా బ్రతుకు మీద ఎంత ఆశ! ఆ భయంకర సముద్రాన్ని దిక్కూ దరీ కనిపించకున్నా ఈదుతూ ఉన్నాడు. అంతకష్టపడీ ఈదక పోతేనేం... హాయిగా మునిగిపోయి ఉంటేనేం.. ఇప్పుడిప్పుడే తనకి అర్థమవుతోంది. జీవితమంటే బ్రతకాలనే పేరాశ! ఇలా సాగిపోతూనే ఉన్నాయి రమణయ్య ఆలోచనలు– ఆలోచిస్తూనే ఎప్పుడు నిద్రలోకి జారుకున్నాడో తేలీదు.

* * * * * * * * * * * * * * * * * *

ఉదయం ఎనిమిదిన్నర అయింది. రమణయ్య లేచేటప్పటికి కడుపులో చిన్నగా నొప్పి ప్రారంభమైనట్టుగా అనిపిస్తోంది. కాలకృత్యాలన్నీ యాంత్రికంగానే ముగిస్తున్నాడేగానీ, తన కడుపులోని నొప్పి గురించే ఆలోచన. డాక్టరు దగ్గరికి పోతే, తనకి ఏ రోగం ఉందని నిర్ధారిస్తాడోనన్నది అతన్ని పీడిస్తోంది.

"ఇప్పుడెట్లుందీ...నొప్పి రాలేదా?" అంటూ ప్రతి అరగంట కోసారి అడుగుతూనే ఉంది విశాల. ఆవిడ కంగారు పడిపోతుందని లేదనే చెబుతున్నాడు తను.

టీవీలో క్రికెట్ వస్తోంటే చూస్తున్నారు పద్మా, బాబులు.

రమణయ్య బయల్దేరేటప్పటికి తొమ్మిదిన్నరయింది. ముందు తనకోలీగ్ మోహనరావుని కలిస్తే అతను మంచి హాస్పిటల్ ని సూచిస్తాడు అనుకున్నాడు రమణయ్య. తిన్నగా ఆటోలో మోహనరావు ఇంటికెళ్లాడు. మోహన్‌రావు అప్పుడే ఆఫీసుకి బయల్దేరుతున్నాడు. తిరిగి రాత్రి వచ్చిన కడుపు నొప్పి విషయమంతా అతనికి చెప్పాడు రమణయ్య.

అంతావిని "నువ్వు ఊహించినంత భయంకరమైన వ్యాధులేవీ ఉండవులే!" అంటూ ఓ మంచి ప్రైవేటు హాస్పిటల్‌ని సూచించాడు మోహనరావు. మోహనరావుకి సెలవు చీటి ఇచ్చేసి మళ్లీ ఆటోలో హాస్పిటల్ వైపు బయల్దేరాడు రమణయ్య.

అరగంటలో హాస్పిటల్ చేరుకున్నాడు.

పనిలో పనిగా తన కడుపునొప్పి విషయంతో పాటు తన ఒంటిపై పుడుతున్న 'జిల' విషయం, కాళ్లూ, మొహం వాపులు వస్తున్న విషయం అన్నీ చెప్పేశాడు రమణయ్య- డాక్టరుతో.

ఏదో గంటకల్లా తిరిగి రావచ్చు కదా అనుకున్న రమణయ్యకు సాయంత్రం అయిదు గంటల వరకూ కేవలం రకరకాల టెస్టులు, స్కానింగులూ చేయించుకోవడానికే పట్టింది. టెస్టు రిజల్టులూ, స్కానింగు రిపోర్టులు తీసుకుని డాక్టరు దగ్గరి కెళ్లాడు. రమణయ్య ఇచ్చిన రిపోర్టులు మౌనంగా తదేకంగా చూస్తూ, అప్పుడప్పుడూ తల ఊపుతూ ఉన్నాడు డాక్టరు. రమణయ్యకి ఎక్కడలేని టెన్షనూ పట్టుకుంది. ఏ అల్సరో అపెండిసైటిసో లేదంటే ఏ కేన్సరో చెబుతాడేమోననీ "నాకు ఏ రోగం లేదని చెప్పేటట్లు చెయ్యి తండ్రీ!" అంటూ ఏడుకొండల వాడికి పదే పదే మొక్కున్నాడు.

"చూడండీ! మీకు పొట్టకు సంబంధించిన జబ్బు ఏదీ లేదు.. ఈ మాత్రలు రాసిస్తాను. మూడు పూటలా రెండు రెండు వేసుకోండి... అయితే, మీ ఒంటి మీద జిల పుడుతోంది అని చెప్పారే... దానికి కారణం మీ మూత్రంలో అల్బుమిన్ కంటెంటు పర్సెంటేజి ఎక్కువగా వుండడమే- ఇంకొక విషయం మీకు చెప్పాలి. మీ కిడ్నీస్ రెండూ ఫెయిల్యూర్ అయిపోయాయి. అంటే మీ మూత్రపిండాలు పాడయ్యాయి" అంటూ డాక్టరు అతి సామాన్య విషయంగా చెబుతోంటే పక్కలో బాంబు పడ్డట్టు అదిరిపడ్డాడు రమణయ్య.

"ఏమిటిసార్! మీరు చెబుతున్నదీ!"

"మీ మూత్రపిండాలు పాడయిపోయాయి. వాటికి వడపోసే శక్తి సన్నగిల్లింది. అందుకే, మీ మూత్రంలో అల్బుమిన్ కంటెంటు శాతం పెరిగింది. నీరంతా శరీరంలోకి పోతోంది. అందుకే, మీ కాళ్లూ, చేతూలూ మొహం వాస్తున్నాయి. మీ శరీరం మీద జిల పుడుతోంది. వీలయినంత త్వరగా మీరు అపరేషను చేయించుకోకుంటే పరిస్థితి అంతబాగుండదు!" అంటూ ఆపేశాడు డాక్టరు.

"ఎంతవుతుంది సార్" అడిగాడు వణుకుతోన్న గొంతుతో

కాసేపు మౌనంగా గాల్లోకి చూసి నుదుటిపై సున్నితంగా గీరుకుంటూ- "కిడ్నీ మాత్రం మీ రక్త సంబంధీకులలో ఎవరైనా డొనేట్ చేయాల్సిందే... ఇక ఖర్చంటారా? దాదాపు రెండు లక్షలు కావచ్చు... అదీ ఈ హాస్పిటల్‌లో అయితే. వేరే నర్సింగు హోమయితే నాకు తేలీదు. ఇంకా ఎక్కువ కావచ్చు. అందుకే ఇక్కడే అపరేషను చేయించుకోండి... మీరు ఆందోళన పడే పనేలేదు, మా హాస్పిటల్‌లో-" అన్నాడు డాక్టరు వాచీ సూచుకుంటూ.

"ఎప్పటిలోగా..." అన్నాడు రమణయ్య.

"వీలయినంత త్వరగా! పరిస్థితి విషమిస్తే ఎవ్వరేం చేయలేరు! ఈ టాబ్లెట్లు వాడుతూ ఉండండి... కాళ్లూ మొహాలూ వాపులు తగ్గుతాయి!" అంటూ మరో చీటిలో మందులు రాసి ఇచ్చాడు డాక్టరు.

అన్నీ వింటూనే యాంత్రికంగా చీటి అందుకుని డాక్టరు ఫీజు చెల్లించేసి బయటపడ్డాడు రమణయ్య.

రద్దీగా వున్న రోడ్డుమీద మెల్లగా నడుస్తున్నాడు.

సూర్యుడు ఎర్రగా పడమటి దిక్కులో జారి పోతున్నాడు.

కాళ్ల కింది భూమి కదిలి పోతున్నట్టుంది రమణయ్యకి. ఊహించని నిజం– భరించలేని వాస్తవం– మెదడు వేడెక్కిపోతోంది. ఎవరో మోటార్ బైకు మీద వెళ్తూ నవ్వుతూ– "హల్లో! నమస్తే రమణయ్యసార్!" అంటూనే వెళ్ళిపోయారు. రమణయ్య ఏమీ ఎరగనట్టు అతని వేపు జీవంలేని చూపులు చూశాడు.

"ఏ చిన్న అపరేషను అయినా ఖర్చు భరించలేను తండ్రీ! చితికి పోయి నాను– అని మొర పెట్టుకుంటే చివరికి నాకు రెండు లక్షలు ఖర్చయ్యే అపరేషను ప్రసాదించావా! అంతా నీ లీల ఏం చేస్తావో చెయ్యి స్వామీ!" అనుకుంటూ విరక్తిగా నవ్వేసాడు.

ఇప్పుడు రెండు లక్షల రూపాయిలు ఎవరిస్తారు?

తనకేం ఆస్తులున్నాయి గనుక! చివరికి స్వంత ఇల్లయినా లేదే! విశాల అపరేషనుకయిన అప్పే ఇంకా తీరలేదు.

పైగా పద్మ ఎదిగి వుంది.

ఎవరితో నైనా ఈ విషయం ఆలోచిస్తే... నో...

ఎందుకు ఆలోచించడం...

ఎవరేం చేయుగలరు?

ఎవరితోనో కాదు తనే ఆలోచించాలి. తనే నిర్ణయించుకోవాలి. తనదిప్పుడు ఏమి చేయాలో తోచని నిస్సహాయ స్థితి!

బస్సు స్టాపు చేరుకున్నాడు. అక్కడ వున్న సిమెంటు బెంచీ మీద చేష్టలుడిగి కూచున్నాడు. సిటీ బస్సులు వస్తున్నాయి, పోతున్నాయి. తను ఏ బస్సుకూ పోవాలని లేదు. ఏదో ఆలోచిస్తూనే వున్నాడు.

బాగా చీకటి పడిపోయింది... ఏదో నిర్ణయానికి వచ్చినట్టు అనిపించింది. తన రోగం గురించీ, దాన్ని బాగు చేయడానికయ్యే ఖర్చు గురించీ ఎవరికీ చెప్పే ప్రసక్తి లేదు. ఎవరయినా ఒక వేళ అప్పు ఇస్తే ఆ డబ్బుతో అపరేషను చేయించుకొని ఇంటిల్లి పాదినీ అప్పుల్లో ముంచడం తనకి ఇష్టం లేదు. ప్రస్తుతం తన కుటుంబానికి తను అపరేషను వల్ల బతకడం కంటే అపరేషను లేకుండా చావటం వల్లే ఎక్కువ ప్రయోజనం. పద్మకి ఉద్యోగమిస్తారు. గ్రాట్యూటీ డబ్బుతో దానికి పెళ్లి అవుతుంది. అంతో ఇంతో వచ్చే పెన్షనుతో విశాలా, బాబులు ఏదో ఓ రకంగా జీవిస్తారు. వచ్చే

ప్రావిడెంటు ఫండుతో ఉన్న అప్పులు తీరిపోతాయి!

"సార్! ఆటో!" అన్న పిలుపుతో తెప్పరిల్లి చూశాడు రమణయ్య. ఎదురుగా ఆటో నిలబడి వుంది. ఆటోలోంచి డ్రైవరు తనకేసి చూస్తూ ఉన్నాడు. మారు మాట్లాడకుండా తన ఇల్లు ఎక్కడున్నదీ అతనికి చెప్పేసి ఆటోలో కూచున్నాడు.

నలభై నిమిషాల్లో ఆటో ఇంటి ముందు ఆగింది. డబ్బు చెల్లించేసి ఇంట్లోకి అడుగు పెడుతుంటే ఎదురొచ్చి ఆత్రంగా "పొద్దున్నించీ ఒకటే భయపడ్డాను. ఏ అస్పత్రిలో అడ్మిటయ్యారోననీ... అమ్మయ్య- వచ్చినావు అంతే చాలు... నొప్పి ఎట్లుంది.... డాక్టరేమన్నాడు..." అంటూ ప్రశ్నల వర్షం కురిపించింది విశాల, కళ్లలో తడితో.

విశాల వేపు చూడకుండా బట్టలు విప్పేసే నెపంతో పక్కకు తిరిగి "ఏమంటాడు... అన్ని టెస్టులూ, స్కానింగులూ, చేయించినాడు... నా జేబులో డబ్బంతా ఖర్చయి పోయాక- నీకు ఏ రోగం లేదు ఉక్కుముక్కలా వున్నావు పోవయ్యా! నొప్పివస్తే ఈ మాత్రలేసుకో అన్నాడు" అంటూ డాక్టరు ఇచ్చిన చిటీలు ఆవిడ చేతిలో వుంచాడు.

"అమ్మయ్య... నీకు ఏ జబ్బూ లేకుంటే అంతకంటే కావల్సిందేముందండీ... అంతా ఏడుకొండల వాడి దయ!" అంది ఆనందంగా విశాల.

అక్కడి నుంచి బాత్రూం వైపు సాగిపోయాడు. రమణయ్య.

*(1994 ఆంధ్రజ్యోతి దీపావళి ప్రత్యేక సంచిక)*